ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
ఆదివారం 23 జూన్ 2024





- ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు
- నోట్ పుస్తకాలు ఏకరూప దుస్తులు కూడా..
- మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరణ
- ప్రభుత్వ నిర్ణయంతో సరికొత్త ఆశలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెరగనున్న ప్రవేశాలు

మళ్లీ మంచి రోజులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22:

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూలై 15వ తేదీ నాటికి పాఠ్య నోటు పుస్తకాల బ్యాగ్ ఇవ్వాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. వీటితోపాటు సమదుస్తులు మధ్యాహ్న భోజన పునరుద్ధరణ, విద్యార్థుల ఫలితాల పురోగతిపై కావాల్సిన అంశాలపై చర్చించారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చేందుకు నూతన ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే అవి అందుబాటులోకి రానున్నాయి. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. సాధారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారిలో ఎక్కువ మంది పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే. గతంలో వీరికి ఏటా ప్రభుత్వమే పుస్తకాలు, తదితర వసతులను కల్పించేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏడాది మాత్రమే అందించి నాలుగేళ్లు నిలిపి వేసింది. దీంతో ఇంటర్ విద్యను గాలి కొదిలేయడంతో గాడి తప్పింది. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు బయట కొనుగోలు చేయడం ఇబ్బందిగా మారగా కొందరు పుస్తకాలు లేకుండానే చదువులు సాగించిన పరిస్థితి నెలకొంది. ఇంకొందరు పూర్వ విద్యార్థుల నుంచి పుస్తకాలు తీసుకుని నెట్టుకొచ్చారు.

దాదాపు పది వేల మందికి లబ్ధి


జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ యాజమాన్యంలో చదువుతున్న మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందనున్న విద్యార్థుల వివరాలు మండలాల వారిగా విద్యాశాఖ సేకరిస్తోంది. పుస్తకాలు బ్యాగులు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీకి వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 21, కేజీబీవీలు 27, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు 12, హైస్కూల్ ప్లస్ 1, ఏపీ మోడల్ స్కూళ్లు 19 ఉన్నాయి. వీటిలో ఇంటర్ విద్యార్థులు ప్రతి ఏడాది మొదటి సంవత్సరంలో దాదాపు నాలుగు వేల మంది చేరే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది నుంచి ప్రభుత్వం, ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని విధాలుగా ఆదుకుంటుండటంతో ప్రవేశాలు మరింతగా పెరిగే అవకాశాలు లేకపోలేదు.

ఐదేళ్లు ఇవ్వలేదు

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు అసలు పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం అమలును అటకెక్కించింది. 2022-23లో చివరి వరకు పుస్తకాలు ఇస్తామంటూ వార్షిక పరీక్షలకు రెండు నెలల ముందు ఇవ్వలేమని చేతులెత్తేసింది. దీంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడ్డారు. పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడింది. దీంతో పాటు ఫలితాలపై కూడా ప్రభావం చూపింది.

ఇతరులపై ఆధార పడి..

ప్రభుత్వ విద్యలో ఎక్కువ శాతం పేద గ్రామీణ కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాల్సి ఉంది. గత ఐదేళ్లు ఇవ్వకపోవడంతో కొందరు పాత వాటితో సరి పెట్టుకున్నారు. మరి కొందరు ఇతర విద్యార్థులపై ఆధారపడటంతో తరగతి గదిలో బోధనలకే పరిమితం కావాల్సి వచ్చింది. దీనికి తోడు ప్రవేశాలపై ప్రభావం పడి ఏటా తగ్గుతూ వచ్చింది. ఇంటర్ విద్యార్థులకు ఈ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు 12 నోటు పుస్తకాలు బ్యాగు, త్వరలోనే అందించనుంది. జిల్లాలో సరాసరి పది వేల మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.



మధ్యాహ్న భోజనంతో మేలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 ఆగస్టులో ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలులోకి తెచ్చింది. దీంతో కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అప్పట్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు అన్ని ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ఈ పథకాన్ని వర్తింజేశారు. దీంతో అప్పట్లో నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో దాదాపు 9 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. పాఠశాలల్లో పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీలతో ఇక్కడ అమలు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉపయోగ కరంగా ఉండేది. రోజంతా కళాశాలలో ఉండి చదువుపై దృష్టి సారించేవారు. పాఠ్య, నోటు పుస్తకాలు ఇవ్వడానికి నిర్ణయించిన కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పురుద్ధరించాలనే నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.





అవకాశాన్ని వినియోగించుకుంటాం

నంద్యాలలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాను. ప్రస్తుత ప్రభుత్వం నోటు పుస్తకాలు, ఇతర పథకాలు ఇవ్వనుండటంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటాం.

- సరస్వతీ బాయి, మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థిని



విద్యార్థులకు శుభ పరిణామం

గత ప్రభుత్వంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు తదితరాలు అందించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రవేశాలపై ఫలితాలపై ప్రభావం చూపింది. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని నిర్ణయించడం హర్షించదగినది. గత ఏడాది మొదటి సంవత్సరంలో 150 మంది విద్యార్థులు చేరితే ఈ ఏడాది 300 మంది విద్యార్థులు చేరారు. ప్రవేశాల సంఖ్య పెరగనుంది.

- రాంబాబు, జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల



సమగ్ర వివరాలు పంపిస్తున్నాం

ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య నోటు పుస్తకాలు బ్యాగు, ఏకరూప దుస్తులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం విద్యార్థుల వివరాలను విద్యాశాఖ సేకరిస్తోంది. సమగ్ర వివరాలను సేకరించి రాష్ట్ర బోర్డుకు పంపిస్తాం. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ కళాశాలలు బలోపేతమవుతాయి.

- సునీత, జిల్లా వృత్తి విద్యాధికారి నంద్యాల

కర్నూలు కలెక్టర్‌గా రంజిత్ బాషా

- బాపట్ల కలెక్టర్‌గా పని చేస్తూ ఇక్కడికి బదిలీ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.సృజన



కర్నూలు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు కొత్త కలెక్టర్‌గా పి.రంజిత్ బాషాను నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. జిల్లా కలెక్టర్‌గా రానున్న రంజిత్ బాషా ప్రస్తుతం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్వస్థలం ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఈయన 2007 గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. తొలుత కడప ఆర్డీవోగా, తర్వాత గుడివాడ ఆర్డీవోగా, సీసీఎల్ పీడీసీ ఎమ్మార్వోగా విధులు నిర్వహించారు. 2018 ఫిబ్రవరిలో ఐఏఎస్‌గా పదోన్నతి పొందారు. విజయవాడ నగర కమిషనర్‌గా, పంచాయితీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టరుగా, కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వంలో ఆనాడు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేసిన నారా లోకేశ్ ఓఎస్డీగా కూడా బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 15న బాపట్ల జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌గా సార్వత్రిక ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించారనే అధికారులు అంటున్నారు. కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ జి.సృజన 2023 ఏప్రిల్ 7న నియమించారు. అంతకుముందు ఆమె గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేశారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక నిక్కచ్చిగా వ్యవహరిస్తూ పేరు తెచ్చుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారిగా పారదర్శకంగా బాధ్యతలు నిర్వహించారు. ఇదిలా ఉండగా నూతన కలెక్టర్ రంజిత్ బాషా శనివారం రాత్రి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సొంత ప్రాంతంలో పోస్టింగ్ రావడంతో జన్మభూమికి సేవ చేసేభాగ్యం దక్కినట్లయిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను చేరువ చేస్తానన్నారు.

నల్లమలలో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

చెంచు గిరిజనుల జీవన స్థితిగతులపై పరిశీలన


ట్రైనీ ఐఏఎస్‌ల బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆత్మకూరు, జూన్ 22: జీవవైవిధ్యానికి మారుపేరైనా నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్‌ల బృందం పర్యటించింది. ఏపీ దర్శన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఐఏఎస్‌ల బృందం అధికారులైన చల్లా కళ్యాణి, హిమవంశీ, ఎస్.జగన్నాథ్, వినూత్న, భావన, శుభం నోకల్‌లు శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి నేరుగా బైర్లూటి ఏకోటూరిజం కేంద్రానికి చేరుకుని అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌రెడ్డిలతో కలిసి నల్లమల చెంచుల జీవన విధానాల గురించి ఆరా తీశారు. అలాగే శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి నల్లమల గిరిజనుల జీవన స్థితిగతులు, అటవీ ఉత్పత్తుల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆ తర్వాత నల్లమలలోని జంగిల్ సఫారీలో పర్యటించి అటవీ, వన్యప్రాణి సంరక్షణ గురించి తెలుసుకున్నారు. బైర్లూటిలోని వన్యప్రాణి సంరక్షణా కేంద్రం, ఆసుపత్రుల గురించి మార్కాపురం అటవీ డివిజన్‌కు చెందిన ప్రొహిబిషన్ ఐఎఫ్ఎస్ శివకుమార్ వివరించారు. అంతకుముందు వారు బైర్లూటి, నాగలూటి చెంచుగూడేలను సందర్శించి చెంచులతో ముచ్చటించారు. కాగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి జ్ఞాపికలను బహుకరించారు. వీరి పర్యటనలో ఆత్మకూరు ఆర్డీవో ఎం.దాసు, తహసీల్దార్ బాబు, నాగలూటి రేంజ్ అధికారి దొరస్వామి తదితరులు ఉన్నారు.


ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

అక్రమ కేసులు పెట్టారు

అసెంబ్లీలో మంత్రి బీసీ ఆవేదన



బనగానపల్లె, జూన్ 22: బనగానపల్లె ఎమ్మెల్యే, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అసెంబ్లీలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలపై స్పందించారు. అక్రమ కేసులు బనాయించి 32 రోజుల పాటు తనను జైలులో ఉంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్న పాత్రుడును అభినందించి అసెంబ్లీలో బీసీ మాట్లాడారు. రెండోసారి తాను ఓడిన తర్వాత బనగానపల్లెలో టీడీపీ కార్యకర్తలపై అనేక కేసులు పెట్టారన్నారు. తనపై కూడా అక్రమ కేసులు పెట్టి 32 రోజుల పాటు జైలుపాలు చేశారన్నారు. బనగానపల్లె, ఆళ్లగడ్డ సబ్‌జైలులో ఉంచకుండా సుదూరంగా ఉన్న ఆదోనిలో సబ్‌జైల్లో ఉంచి చాలా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కేసులు సీఎం చంద్రబాబునాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై కూడా పెట్టారన్నారు. పోలీసుల వేధింపులతో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వారందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. కౌరవ సభను గౌరవ సభగా మార్చిన ఘనత చంద్రబాబుదే అని మంత్రి బీసీ కొనియాడారు.

రేపు ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

నంద్యాల (కల్చరల్), జూన్ 22: ఈనెల 24వ తేదీన సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

శ్రీశైలం, జూన్ 22: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు రవినాథ్ తిల్హారి, మదన్ గోపాల వ్యాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరు వేర్వేరుగా స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్లగా ఆలయ రాజగోపురం వద్ద వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా రత్నగర్భ వినాయక స్వామిని దర్శించుకున్న తర్వాత భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వారికి స్వామిఅమ్మవార్ల వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.


మల్లన్నను దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారి

హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించండి

- ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు
- కలెక్టర్


సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమైన కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూన్ 22: జిల్లాలోని అన్ని సంక్షేమ, గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సంబంధిత హాస్టళ్ల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో నంద్యాల జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు, కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అంబేడ్కర్ గురుకుల, జ్యోతిరావు పూలే పాఠశాలల్లో సీట్లన్నీ భర్తీ వివరాలను గిరిజన సంక్షేమ అధికారికి సోమవారంలోగా అందజేయాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టల్‌లో సీట్లు దొరకని విద్యార్థులకు జిల్లాలో ఉన్న 13ఎస్టీ హాస్టళ్లల్లో ప్రవేశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 38 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 34 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలు, వసతి సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆహారపదార్థాల నాణ్యత, భోజనశాలలు, వంట గదులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



హ్యాపీ...

కర్నూలు నగర శివారులోని ఐఐఐటీడీఎం క్యాంపస్ ప్రాంగణంలో 6వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ విద్యా సంస్థ నుంచి పలువురు విద్యార్థులు బీటెక్ పూర్తి చేసుకుని పట్టాలు అందుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు.

వివరాలు 7లో..





వేదికపై అతిథులు

చిత్తశుద్ధి, నిజాయితీ ఉండాలి

- నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్ కుమార్ సర్వసప్త్
- ఘనంగా కర్నూలు ఐఐఐటీడీఎం 6వ స్నాతకోత్సవం
- పలువురికి డిగ్రీ పట్టాలతోటు బంగారు పతకాలు ప్రదానం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 22: ఏ వృత్తిలో ఉన్నా చిత్తశుద్ధి, నిజాయితీ, విధేయతో ఉండాలని నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సర్వసప్త్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కర్నూలు ఐఐఐటీడీఎం క్యాంపస్ ప్రాంగణంలో ఐఐఐటీడీఎం ప్రొఫెసర్ బీఎస్ మూర్తి అధ్యక్షతన శనివారం 6వ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ క్యాంపస్‌లోని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలు కొత్త పథంలో నడిపిస్తున్నారని అభినందించారు. నానో టెక్నాలజీ, డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ మానవ జీవితాన్ని మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే సైన్స్ పరిశోధనలు భారతదేశంలో తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ సమస్యలు పరిష్కరించుకోవడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు ఆయన సూచించారు. తద్వారా పట్టణ వలసలను నియంత్రించవచ్చన్నారు. ఇన్నోవేషన్ నాలెడ్జ్ జనరేషన్, ట్రాన్స్‌ఫార్మేషన్ భవిష్యత్ తరాలకు కీలకం అవుతుందన్నారు. కర్నూలు ఐఐఐటీడీఎం డైరెక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ రూపంలో దేశాభివృద్ధికి ఐఐఐటీడీఎం నిరంతరం తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగాలను కల్పించే సృష్టికర్తలుగా ఎదగాలని సూచించారు. ప్రాంగణాన్ని వదిలిపోతున్న (అవుట్‌గోయింగ్) విద్యార్థులు క్యాంపస్‌కు అంబాసిడర్లుగా మారాలని ఆకాంక్షించారు.







స్నాతకోత్సవానికి హజరైన విద్యార్థులు

సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌ల నుంచి 143 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లకు డైరెక్టర్ బీఎస్.మూర్తి డిగ్రీ పట్టాలను అందజేశారు. అంతకుముందు క్యాంపస్ టాపర్‌గా నిలిచిన మెకానికల్ విభాగం విద్యార్థి సాయి గణేశం ఎల్లమ్‌కు గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేశారు. అలాగే బీటెక్ సీఎస్ఈ విభాగంలో పరాస్ యాదవ్‌కు బీటెక్ (ఏఐఅండ్‌డీఎస్) విభాగంలో మోహిత్ సింగ్, బీటెక్ ఈసీఈ విభాగంలో ఇమ్మడిశెట్టి శ్రీప్రియకు, మెకానికల్ విభాగంలో సాయి గణేశ్ ఎల్లమ్‌కు గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేశారు. అలాగే బీటెక్ సీఎస్ఈ విభాగం విద్యార్థిని చేబ్రోలు వర్షకు స్వర్గీయ దుర్వాసుల మాణిక్యాంబ ఎండోమెంట్ గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఐటీడీఎం కర్నూలు వ్యవస్థాపక డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, తిరుపతి ఐఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఎన్ఐటీ రాయపూర్ డైరెక్టర్ రమణారావు, ఐఐఐటీడీఎం కర్నూలు రిజిస్ట్రార్ గురుమూర్తి, సేనేటర్లు, డీన్లు, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే సాధ్యం



క్యాంపస్ అధ్యాపకుల బోధనకు ఇంటర్నెట్, ప్రాక్టికల్ థియరీ అంశాలపై పట్టు పెంచుకోవడంతోనే 9.5 సీజీపీఏ సాధ్యమైంది. దీనికి తోడు విదేశాల కంపెనీలు, యూనివర్సిటీలతో పరస్పర ఒప్పందం చేసుకోవడం వల్ల ఆయా యూనివర్సిటీల్లో బోధిస్తున్న అంశాలు ఎన్నో అవగతం చేసుకోవడం జరిగింది.

- కర్నూలు ఐఐఐటీడీఎం క్యాంపస్ టాపర్, మెకానికల్ ఇంజనీర్ విభాగం, సాయి గణేష్ ఎల్లమ్, కర్నూలు

సంతోషంగా ఉంది



బీటెక్ సీఎస్ఈ విభాగంలో టాపర్‌గా రావడం సంతోషంగా ఉంది. రెగ్యులర్‌గా క్లాసులకు వెళ్లడం, ఇంటర్నల్స్ ఉపయోగించుకోవడంతో పాటు ఫ్యాకల్టీ సూచనలను విని అర్థం చేసుకోవడంతోనే 9.3 సీజీపీఏ సాధించాను. స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.

- బీటెక్ సీఎస్ఈ విభాగం టాపర్ పరాస్ యాదవ్, కాన్పూర్, ఉత్తర్‌ప్రదేశ్

క్యాంపస్‌కు రుణపడి ఉంటా



మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చిన క్యాంపస్‌కు రుణపడి ఉంటాం. ఎలాంటి ఒత్తిడికి లేకుండానే సాధారణంగా ప్రిపరేషన్ అయ్యాను. హైదరాబాదు ఐఐటీలో పీహెచ్‌డీ చేయాలన్నదే లక్ష్యం.

- బీటెక్ సీఎస్ఈ విభాగం, చేబ్రోలు వర్ష, మాచవరం, పొన్నూరు, గుంటూరు

ఎంబీఏ కోర్సు చేస్తా



కష్టానికి ఫలితం దక్కింది. ఇది నిరంతర కృషి వల్లే సాధ్యమైంది. ఇందులో ఫ్యాకల్టీ పాత్రే కీలకం. ఉద్యోగంలో చేరి అనంతరం ఎంబీఏ కోర్సు చేయాలన్నదే లక్ష్యం.

- బీటెక్ ఈసీఈ విభాగం టాపర్, ఇమ్మడిశెట్టి శ్రీప్రియ, నెల్లూరు



స్నాతకోత్సవంలో విద్యార్థులు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

26న ఆర్థిక సంఘం సభ్యుల సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 22: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం కమిటీ పర్యటన సందర్భంగా ఈ నెల 26న సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఆదాయం, ఖర్చుల వివరాలపై సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఎంపిక చేసిన గ్రామ సర్పంచులు హాజరు కావాలని కోరారు. అదే విధంగా ఉదయం 10:30 జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లా డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీ, డివిజన్‌కు ముగ్గురు చొప్పున ఎంపికైన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు హాజరు కావాలని తెలిపారు.

రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), జూన్ 22: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరి ఉద్యోగ ఖాళీల భర్తీకి రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టు శనివారం విడుదలైంది. జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ తెలిపారు. గత ఏడాది నవంబరు 11న ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో, కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేశామన్నారు. అభ్యర్థులు తమ మెరిట్ వివరాలను సరి చూసుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు.

రేడియోథెరపి టెక్నీషియన్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన రేడియో థెరపి టెక్నీషియన్ పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు, సెలక్షన్ లిస్టు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్, కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24, 25 తేదీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై చర్యలు

కర్నూలు(అర్బన్), జూన్ 22: కర్నూలు మండలం దిన్నెదేవరపాడులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న రెండు హిటాచీలు సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆకస్మికంగా తనిఖీ చేయగా సర్వే నెంబర్ 396, 477 రెండు హిటాచీలతో రెండు రోజులుగా తవ్వకాలు చేపడుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆ యంత్రాలతో పాటు, ట్రాయిలర్‌ను తాలుకా పోలీస్‌స్టేషన్ తరలించి విచారణ జరుపుతున్నామని డీడీ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగిరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న గనుల శాఖ అధికారులు

తల్లీ కొడుకులపై కట్టెలతో దాడి

నలుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 22: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వాకిలి చార్లెస్, అతని తల్లి వాకిలి కామాక్షిలపై అదే గ్రామానికి చెందిన బైయన్నగారి ప్రభుదాసు, భూదూరు ఏసేపు, చిన్న ఈరన్న, ప్రసాద్ అనే వ్యక్తులు కట్టెలతో దాడి చేసి గాయపరిచినట్లు మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. శనివారం తన తల్లిని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకు వెళ్తుండగా.. ఈ నలుగురు అడ్డగించి కట్టెలతో దాడి చేసి తల పగలకొట్టారు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డు వచ్చిన తన తల్లి కామాక్షిపై పిడిగుద్దులు గుద్దడంతో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రభుదాసు, ఏసేబు, చిన్న ఈరన్న, ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పొలంపై విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఉందని, దీని కారణంగానే గొడవ జరిగిందని ఎస్ఐ తెలిపారు.

రైలు పట్టాలపై మృతదేహం

ఆదోని, జూన్ 22: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై గోపాల్ తెలిపారు. శనివారం ఆదోని రైల్వే స్టేషన్ సమీపంలోని 494/38 కి.మీ దగ్గర 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఆ వ్యక్తిని గుర్తుపడితే సెల్ నెం. 9849157634 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 22: జిల్లా పరిషత్ పరిధిలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. శనివారం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి చేతుల మీదుగా ముగ్గురు అటెండర్లుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం జూపాడుబంగ్లా, ఎంపీడీవో కార్యాలయం కోసిగి, ఎంపీడీవో కార్యాలయం అవుకులో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఒలింపిక్ డే రన్



క్రీడాజ్యోతులతో కలెక్టర్ డా.జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్



క్రీడాజ్యోతులతో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 22: కర్నూలు నగర కూడళ్లలో క్రీడాజ్యోతులతో ఉల్లాసంగా ఒలింపిక్ డే రన్ కొనసాగింది. ఒలింపిక్ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం, డీఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలో పరుగు కొనసాగింది. ఒలంపిక్ సంఘం ఛైర్మన్ కేఈ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, కర్నూలు జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, క్రెడాయ్ ప్రతినిధి సాయిరాం రెడ్డి హాజరయ్యారు. ఐదు క్రీడాజ్యోతులు రాజ్‌విహార్, రివర్ వ్యూ కాలనీ దగ్గర కలుపుకొని డీఎస్ఏ స్టేడియం చేరుకున్నారు. స్టేడియంలో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొని మంచి శిక్షణతో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాథమిక దశ నుంచి క్రీడల సాధన చేస్తే మంచి ఫలితం దక్కుతుందన్నారు. క్రీడలకు ప్రభుత్వం మంచి గుర్తింపు ఇస్తుందని తెలిపారు. అనంతరం అతిథులు అంతర్ పాఠశాలల క్రీడా విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగా జాతీయ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, శ్రీధర్ రుద్రారెడ్డి, సునీల్ కుమార్, అవినాశ్ శెట్టి, గ్రీన్‌కో సభ్యులు శ్రీనివాసులు నాయుడు, సాఫ్ట్‌బాల్ విజయ్, లోకేశ్, అబుబకర్, ఈశ్వర్ నాయుడు, ఒలింపిక్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పోలీసునని చెప్పి రూ.8 వేలు వసూలు

మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

మంత్రాలయం, జూన్ 22: మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన చార్లెస్ కొడుకు రంగన్న నుంచి సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ నని చెప్పి ఓ వ్యక్తి రూ.8వేలు వసూలు చేశాడు. తనను బెదిరించి మోసం చేసి డబ్బును ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించుకున్నాడని బాధితుడు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశా డు. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, బాధితుల వివరాల మేరకు.. చిలకలడోన గ్రామానికి చెందిన రంగన్న అనే యువకుడు మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ముం దుగా సైబర్ నేరస్థులు మహిళతో ఫోన్‌లో మాట్లాడించి భయపెట్టారు. అనంతరం సైబర్ క్రైమ్ కానిస్టేబుల్‌నంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీపై కేసు నమోదైందని, నీవు, నీ తండ్రి, నీ తల్లిని ఆరు నెలలు జైలుకు పంపుతామని, వెంటనే నీవు ఫైన్ కట్టాలని' ఫోన్‌లో బెదిరించాడు. భయపడిన రంగన్న ఒక్కసారి రూ.5 వేలు అరగంటకు రూ.3 వేలు మొత్తం రూ.8వేలు చెల్లించాడు. ఆపైన ఊరుకోకుండా మరింత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌ను బాధితుడు ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిసారతో యువకుడి మృతి

- తహసీల్దార్ కార్యాలయం ముందు మృతదేహంతో ధర్నా
- బాధ్యులైన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్

జూపాడుబంగ్లా, జూన్ 22: అతిసారతో శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మూడు రోజుల నుంచి కలుషిత నీరు తాగి 30 మంది దాకా అతిసారతో అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలోనే శనివారం నాగన్న(35) అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులంతా కలిసి జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా సీపీఐ, ఎమ్మార్పీఎస్ ధర్నా నాయకులు నిలిచారు. కలెక్టర్ వచ్చి మృతికి కారణమైన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని డిమాండు చేస్తూ మూడు గంటలపాటు ధర్నా చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై ధర్నా చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపటికి ఆర్‌డీవో దాసు, నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, జయశేఖర్, జగన్‌మోహన్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నాగన్న మృతికి కారణమైన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్డీ, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఉన్నతాధికారులు ఆదేశించిన చికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేసిన వైద్య సిబ్బందిని సస్పెండ్ చేసేవరకు ధర్నా విరమించబోమని భీష్మించుకొని కూర్చున్నారు. మృతుడి కుటుంబానికి ఐదు ఎకరాలు పొలం, కుటుంబంలో ఒకరి ఉద్యోగం, ప్రభుత్వం రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేసియా అందించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో దాసుకు వినతి పత్రం అందజేశారు. అస్వస్థతకు గురైనా వారికి మెరుగైనా వైద్యసేవలు అందించాలని డిమాండు చేశారు. బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నందికొట్కూరు వైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, స్వాములు, దిలీప్, ఎంపీపీ సువర్ణమ్మ, మాజీ సర్పంచ్ రవికాంత్, గ్రామస్థులు వారికి మద్దతుగా న్యాయం చేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జగన్ చిత్రాల తొలగింపు



తమ్మరాజుపల్లె సచివాలయంపై ఉన్న జగన్ చిత్రాలను తొలగిస్తున్న అధికారులు

పాణ్యం, జూన్ 22: మండలంలోని తమ్మరాజుపల్లె సచివాలయంపై ఉన్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం జగన్ చిత్రాలు, లోగోలను తెల్లరంగుతో పూడ్చివేశారు. అలాగే గ్రామంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న జగన్ చిత్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు దుబాయ్ శీను, తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ

నందికొట్కూరు, జూన్ 22: నీట్ పరీక్షను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆది శనివారం ఓ ప్రకటనలో కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీక్ కావడంతో 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చాయని, గత సంవత్సరం చూసుకుంటే ఒకరు లేదా ముగ్గురికి ఫుల్ మార్కులు వచ్చాయని అన్నారు. అయితే ఈ సంవత్సరం 67 మందికి ఏ విధంగా పూర్తి మార్కులు వచ్చాయో ప్రభుత్వం తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కొక్క పేపర్‌ను రూ.30 లక్షలకు అమ్ముకున్నట్లు బీహార్లో ఒక గ్యాంగ్ పోలీసుల ఎదుట ఒప్పుకున్నారని, పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ చేసిన వారిపై క్రిమినల్ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు.

వానపాముల ఎరువు తయారీపై రైతులకు శిక్షణ



వానపాముల ఎరువు తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

మహానంది, జూన్ 22: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో వానపాముల ఎరువు తయారు చేసే విధానంపై ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీనివాసులరెడ్డి, ఎం.రవి కిషోర్‌లు శిక్షణ ఇచ్చారు. శనివారం గ్రామం ప్రధాన కూడలిలో రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు సమావేశం నిర్వహించారు. అనంతరం వానపాములతో ఎరువులు తయారు చేసుకోవడం వల్ల రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందని అన్నారు. దీనివల్ల తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. అలాగే వానపాములు, వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల రైతులకు అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వరి, మొక్కజొన్న, మినుము, పసుపు పంటల సాగులో మెళకువల గురించి వివరించారు. శాస్త్రవేత్త వెంకటేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.


ఆలయ భూములకు కౌలు వేలం

పాణ్యం, జూన్ 22: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవాదాయ భూముల కౌలు వేలాల్లో ఆదాయం పెరిగినట్టు గ్రూపు ఆలయాల ఈవో సువర్ణ తెలిపారు. పాణ్యంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన కౌలు వేలాల్లో రామస్వామి ఆలయానికి చెందిన 49.04 ఎకరాలకు రూ. 3, 14, 500లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వీరనారాయణస్వామి ఆలయానికి చెందిన 8.02 ఎకరాలకు రూ.82 వేలు, పాణికేశ్వరస్వామి ఆలయానికి చెందిన 5.61 ఎకరాలకు రూ.90 వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత కౌలు వేలాల్లో రూ. రూ.2,83,500ల ఆదాయం రాగాఈ ఏడాది రూ.4,86,500 ఆదాయం చేకూరినట్లు తెలిపారు. దీంతో రూ. 2,03 లక్షల ఆదాయం పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, రైతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సొసైటీల్లో రైతుల వివరాలు కంప్యూటరైజేషన్'

పాణ్యం, జూన్ 22: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో రైతుల వివరాలను కంప్యూటరైజేషన్ చేస్తున్నట్లు పాణ్యం, మద్దూరు సొసైటీల సీఈవోలు మాయలూరి హుశేన్ మియా, కోట్ల నరసింహ తెలిపారు. శనివారం వారు మట్లాడుతూ ఇందుకోసం సంఘాలలోని సభ్యులు తమ సభ్యత్వం కొనసాగడానికి ఆధార్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పట్టాదారుపాసు పుస్తకం, పాన్‌కార్డు, మొబైల్ నెంబరు, నామినీ ఆధార్ కార్డు జిరాక్సు కాపీలు సొసైటీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్‌గా ప్రకాశరావు



నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్‌గా ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఉమ్మడి కర్నూలు జిల్లా ఆప్టా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలో ఈ నెల 21వ తేదీన ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలో మరో సారి కర్నూలు జిల్లాకు చెందిన ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాశరావు ఫ్యాప్టో కోచైర్మన్‌గా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన ఫ్యాప్టో ఉద్యమాలలో ఆయన కీలక నేతగా వ్యవహరించారని గుర్తు చేశారు. కర్నూలు జిల్లా ఆప్టా అధ్యక్షుడు మధు సూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఫీ ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ఆత్మకూరు, జూన్ 22: మండలంలోని శ్రీపతిరావుపేట మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మణరావు అనే కానిస్టేబుల్‌కు గాయాల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లమలలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన నేపథ్యంలో ఆత్మకూరు నుంచి కానిస్టేబుల్స్ పోలీసు వాహనంలో బైర్లూటికి బయలుదేరి వెళ్తున్నారు. ఈక్రమంలోనే శ్రీపతిరావుపేట మలుపు వద్ద శ్రీపతిరావుపేట నుంచి మట్టిలోడుతో ఆత్మకూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఆకస్మికంగా మలుపు తిప్పే క్రమంలో నిలిచిపోయింది. దీంతో ఒక్కసారిగా పోలీసువాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్‌లో ఉన్న లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా పోలీసు వాహనం సెఫ్టీ బెలూన్స్ తెరుచుకోవ డంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు స్వల్పగాయాలతో బయపడ్డారు. క్షతగాత్రులకు ఆత్మకూరులోని ఆసుపత్రిలోకి తీసుకెళ్లి చికిత్సలు నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహానంది, జూన్ 22: మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని ప్రధాన రైల్వే ట్రాక్‌పై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. ప్రధాన రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి తల పెట్టి ఆత్మహత్య చేసుకొన్నట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తుందని చెప్పారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి



జూటూరు షిర్డీసాయి ఆలయంలో హారతి ఇస్తున్న పీఠాధిపతి

నంద్యాల (కల్చరల్), జూన్ 22: పట్టణంలో అమ్మస్పటిక లింగేశ్వరాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం హోమాలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు యోగానంద మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి మూలస్తంభం వ్యవసాయం అని అన్నారు. వ్యవసాయానికి తొలి పనిముట్టు నాగలి, ముఖ్య వనరు వర్షం అని, వ్యవసాయానికి కావాల్సిన వర్షాన్ని కురిపిస్తారని భావించే ఇంద్రుణ్ణి పూజిస్తూ హోమాలు నిర్వహించామని చెప్పారు. ఉదయం అమ్మ స్పటికలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఏరువాక పౌర్ణమి హోమాలు అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

పాములపాడు: ఏరువాక పౌర్ణమి పర్వదినం సందర్భంగా షిర్డీసాయి ఆలయంలో పీఠాధిపతి రామానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని శ్రీ నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమంలో పీఠాధిపతి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని దేవుళ్లకు పూజలు చేసి పంటలు మంచి దిగుబడి సాధించాలని పూజించారు. మండలంలోని కరిమద్దెల గ్రామంలోని సాయిబాబా ఆలయంలో టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి, కుమార్తె సుజాత, అల్లుడు రామేశ్వర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు అన్నదానం చేశారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన భక్తులు



గడివేముల: కరిమద్దెలలో అన్నదానం చేస్తున్న నాయకులు

'వడ్డెర్ల సంక్షేమానికి చొరవ చూపాలి'



బైరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

మిడుతూరు, జూన్ 22: వడ్డెర కులస్థుల సంక్షేమానికి చొరవ చూపాలని వడ్డెర సంఘం నాయకులు వడ్డె చక్రధర్, వడ్డె శివశంకర్ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని కోరారు. నంద్యాల జిల్లా వడ్డెర సఘం నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డిని శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వడ్డె శివమణి, వడ్డె శ్రీను, శంకర్, రాజు తదితరులు ఉన్నారు.

'వెయ్యి ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యం'



ఆయిల్ ఫామ్ మొక్కను నాటుతున్న రైతు

నంద్యాల రూరల్, జూన్ 22: జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తరింపజేసేందుకు 2024-25వ సంవత్సర ప్రణాళిక కింద వెయ్యి ఎకరాల లక్ష్యం ఉందని, ఇప్పటి వరకు వంద ఎకరాల్లో సాగు చేశారని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తెలిపారు. శనివారం నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో రైతు పరమేశ్వరరెడ్డికి చెందిన 10 ఎకరాల పొలంలో 600 మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ రైతుకు గోదావరి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుపై శిక్షణ ఇప్పించామన్నారు. ఆయిల్ ఫామ్ విస్తీర్ణ లక్ష్యంలో భాగంగా ఒక హెక్టార్‌కు 150 మొక్కలను రూ.29 వేల రూపాయల సబ్సిడీతో వందశాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. నిర్వహణ ఖర్చుల కింద మొదటి నాలుగు సంవత్సరాలకు అంతరపంట సాగు చేసుకునేందుకు ప్రతి ఏటా హెక్టార్‌కు 5,250 ఇవ్వనున్నట్లు, ఒకరైతు గరిష్ఠంగా 25 ఎకరాల వరకు లబ్ధి పొందుపొందుతారని అన్నారు. మొక్కలను వందశాతం రాయితీతో మంజూర్ చేస్తామన్నారు. నీరు ఇంకిపోయే స్వభావం ఉన్న పొలాలలో మంచి దిగుబడి వస్తుందన్నారు. ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విదేశీ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న అబులైస్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఇచ్చిన హామిని నెరవేర్చిందని అబ్దుల్ కలాం విదేశి విద్య పథకాన్ని వినియోగించుకోవాలని ఆల్‌మేవా నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు అబులైస్, అబ్దుల్ సమ్మద్, కోరారు. నంద్యాల ఎమ్మెల్యే ,రాష్ట్ర ముస్లిం మైనారిటి న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, ఇచ్చిన ప్రకటనలతో ఆల్‌మేవా నాయకలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం నంద్యాలలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అబులైస్ మాట్లాడుతూ.. మైనారిటిలలోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఈ పథకం ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దుందని అన్నారు. గత వైసిపి పాలనలో మైనారిటిలకు ఇచ్చిన ఏ హమిలను నెరవేర్చక పోవడంతోనే మైనారిటిలు బుద్ధి చెప్పారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇమ్రాన్ భాష, సలీం, ఉపాధ్యక్షులు అమీరుద్దీన్, జాకిర్‌హుసేన్, జాకిర్, తదితరులుపాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ'

ఆత్మకూరు, జూన్ 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎ, పీడీఎస్‌యూ నాయకులు నాగార్జున, జునేద్ కోరారు. ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో శనివారం విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు77ను తీసుకొచ్చి చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకుండా అన్యాయం చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల 3,4,5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడాన్ని రద్దు చేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని, మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

నేత్రాలు దానం



నేత్రాలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

నంద్యాల (కల్చరల్), జూన్ 22: నంద్యాలకు చెందిన ఫొటోగ్రాఫర్ నాగేంద్రకుమార్ తల్లి సుబ్బలక్ష్మమ్మ శుక్రవారం మరణించారు. తన తల్లి కళ్లను దానం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు నాగేంద్ర కుమార్ ఆయుష్ యోగా కేంద్రం నిర్వాహకుడు ఆనంద్ గురూజీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కర్నూలులోని నేత్రాలయ ఆసుపత్రి అధికారులను పిలిపించి సుబ్బలక్ష్మమ్మ నేత్రాలను దానం చేశారు. టీచర్ బాహుజీ నాయక్, టాగూరి యశ్వంత్, రాగూరి ప్రభాకర్ ఉన్నారు.

అక్రమ లే అవుట్‌లపై నిఘా పెట్టండి: డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో మంజులావాణి

నంద్యాల రూరల్, జూన్ 22: జిల్లాలో అక్రమ లే అవుట్‌లపై నిఘా పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి మంజులావాణి ఆదేశించారు. నంద్యాలలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డివిజన్ పంచాయతీ అధికారులతో పాటు, గ్రేడ్1, గ్రేడ్2 పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా, ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

'పారిశ్రామిక హబ్‌గా ఉమ్మడి జిల్లా'



మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఇండస్ట్రియల్ అసోషియేషన్ ప్రతినిధులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులు రాజమహేంద్రనాథ్, ప్రభు వికాస్ తెలిపారు. శనివారం అమరావతిలో రాష్ట్ర పారిశ్రామిక మంత్రి టీజీ భరత్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. కేక్ కట్ చేసి టీజీ భరత్‌ను సన్మానించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి గానూ యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకరంగా పరిశ్రమలు స్థాపించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని వారు మంత్రిని కోరారు. సేవ, తయారి రంగంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన టీజీ భరత్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రైతు ఆత్మహత్యపై అధికారుల విచారణ



రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్థులను విచారిస్తున్న అధికారులు

కొత్తపల్లి, జూన్ 22: మండలంలోని సింగరాజుపల్లిలో ఈ నెల 20వ తేదీన అప్పులబాధ తాళలేక వెంకటరమణ అనే ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులను కొత్తపల్లి తహసీల్దార్ తిరుపతయ్య, మండల వ్యవసాయాధికారి మహేష్, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ విచారించారు. శనివారం వారు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సింగరాజుపల్లె గ్రామానికి వెళ్లి వెంకటరమణ భార్య లక్ష్మీదేవితో పాటు గ్రామస్థులను ఆ రైతు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటరమణకు రెండెకరాల సొంత భూమితో పాటు, నాలుగెకరాలు దేవునిమాన్యం భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నట్లు విచారణలో తెలిపారు. ఏటా నష్టాలు చవి చూడటంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పులు చేసినట్లు చెప్పారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై కొత్తపల్లి-లింగాపురం గ్రామాల మధ్యలో ఓ వ్యవసాయ పొలంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వెంకటరమణకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండగా.. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేసినట్లు చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసీల్దార్ తిరుపతయ్య వెల్లడించారు.

డీజీపీని కలిసిన నందికొట్కూరు ఎమ్మెల్యే



డీజీపీ తిరుమలరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 22: రాష్ట్ర డీజీపీ తిరుమలరావును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభ సమావేశం రెండో రోజు పూర్తిన అనంతరం డీజీపీ తిరుమలరావును ఆయన చాంబర్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యేతో పాటు పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు.

'రాష్ట్రంలో ప్రజా పాలన'



సచివాలయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: రాష్ట్రంలోని ప్రజలు కూటమికి చారిత్రాత్మకమైన విజయాన్ని అందించారని అభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలనతో రాష్ట్రం ముందుకు వెళుతోందని టీడీపీ మాజీ కౌన్సిలర్, 28 వార్డు ఇన్‌చార్జి కృపాకర్ అన్నారు. నంద్యాలలోని 28వార్డు, 33వ వార్డులోని సచివాలయ కార్యాలయాల్లో కృపాకర్, 33వార్డు టీడీపీ నాయకులు జోసఫ్, తదితరులు సందర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను సచివాయంలో ఏర్పాటు చేయాలని చిత్ర పటాలను అందజేశారు. ప్రజా రంజక పాలనకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి, దివాకర్, శరత్, మధు సూధన్, ఖాసిం, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ హల్‌చల్

- సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలు తీసుకెళ్లిన టీడీపీ నాయకులపై చిందులు
- మాబున్నీసా నిర్వాకంపై పోలీసులకు ఫిర్యాదు



హల్‌చల్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, తన వార్డులోని సచివాలయంలో హల్‌చల్ చేశారు. టీడీపీ నాయకులు, త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. టీడీపీ 29వ వార్డు ఇన్‌చార్జి మంజుల సుబ్బరాయుడు, తిమ్మయ్య సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ చిత్రపటాలను సచివాలయ సిబ్బందికి అందజేసేందుకు వెళ్లడంతో చైర్‌పర్సన్ వారిపై చిందులు వేశారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అని, తన వార్డు సచివాలయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలు ఎలా పెడతారంటూ దుర్భాలాడారు. మంజుల సుబ్బరాయుడును నానా మాటలు అన్నారు. అంతటితో ఆగకుండా 3 టౌన్ సీఐకి నరసింహులుకు ఫోన్ చేసి అక్కడికి పిలిపించుకున్నారు. అయితే నంద్యాల ఎమ్మెల్యే, మంత్రి అనుమతితోనే చిత్రపటాలను అందించేందుకు వచ్చామని చెప్పడంతో ఫరూక్ ఎవరంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ చిందులు వేశారు. తన సచివాలయంలో తన అనుమతి లేకుండా ఎలా పెడతారంటూ తిమ్మయ్య కులం పేరుతో దూషించారు. ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకోవడంతో అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది సముదాయించే ప్రయత్నం చేశారు. మాబున్నీసా నిర్వాకంపై సుబ్బరాయుడు, తిమ్మయ్య త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించి తగు చర్యలు చేపడతామని త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపారు.

'సమస్యను పరిష్కరించాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 22: పదో తరగతి పరీక్షల్లో 2022లో అంకిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన మాల్ ప్రాక్టీస్ కారణంగా విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని, లేకపోతే కర్నూలు డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్ హెచ్చరించారు. నంద్యాలలోని ఎస్టీయూ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మాల్‌ప్రాక్టీస్ కారణంగా ఉపాధ్యాయులపై కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులర్ చూస్తూ వారికి రావాల్సిన జీత భత్యాలను తదితర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి సమస్యలను జిల్లా అధికారులు తాత్సారం చేయడం సరికాదని అన్నారు. ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, సుబ్బరాయుడు, జయప్రకాష్, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

'తాగునీటి ట్యాంకులపై ప్రత్యేక దృష్టి సారించాలి'

కొత్తపల్లి, జూన్ 22: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఎంపీడీవో జవహర్‌బాబు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి శుభ్రతపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని రకాల ఓహెచ్ఎస్ఆర్‌లు, ఓహెచ్‌పీఆర్‌లు జీఎల్ఎస్ఆర్‌లు శుభ్రం చేయించిన రోజు తేదీని ట్యాంకులపై కనబరచాలన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రతి వీధిలో డ్రైనేజీలను, తాగునీటి పైపులైన్లను పరిశీలించాలని, నీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ ద్వారా క్లోరినేషన్ చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లోని వీధుల్లో రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు.

కొలను భారతి క్షేత్రంలో పూజలు

కొత్తపల్లి, జూన్ 22: నల్లమలలో కొలువైన సరస్వతి అమ్మవారు కొలను భారతి క్షేత్రంలో వారం రోజులుగా భక్తజన సందడి నెలకొంది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి తమ చిన్నారులకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాస క్రతువులు చేయించు కుంటున్నారు. శనివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో అమ్మవారి సన్నిధిలో భక్తజన సందడి నెలకొంది. ఈవో మోహన్ ఆదేశల మేరకు పురోహితులు ప్రాతఃకాల సమయంలోనే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పలు పుష్పాలతో పూజలు చేసిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. శనివారం అమ్మవారి సన్నిధిలో 32 మంది చిన్నారులకు అక్షరాభ్యాస క్రతువులు చేయించుకున్నట్లు ఈవో మోహన్ తెలిపారు. విచ్చేసిన భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

'చెత్తాచెదారం తొలగించాలి'

ఆత్మకూరు రూరల్, జూన్ 22: పట్టణంలోని పలు కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, పట్టణ నాయకులు స్వాములు, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, రామ్ నాయక్ కోరారు. శనివారం సీపీఎం పట్టణ ప్రతినిధి బృందం పట్టణంలోని పలు వీధులలో పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డులతో పాటు, ప్రధాన రహదారి వెంట, కూడళ్లలో పేరుకు పోయిన చెత్తను తొలగించాల్సి ఉండగా, డంపు యార్డుకు రోడ్డు లేదనే నెపంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందని అన్నారు.

ఏరువాక పౌర్ణమిని అధికారికంగా నిర్వహించాలి

మద్దికెర, జూన్ 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఏరువాక పౌర్ణమి అంటే ఎంతో ఇష్టమని, అలాంటి ఏరువాక పౌర్ణమిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ అన్నారు. శనివారం మద్దికెరలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సుఖసంతోషాలతో ఏరువాక పౌర్ణమిని నిర్వహించుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ప్రతి రైతుకు పావలా వడ్డీ కింద రుణాలు ఇప్పించాలన్నారు. 90 శాతం రాయితీతో రైతులకు విత్తనాలు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మదనంతపురం హనుమన్న, కోదండరాముడు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న శ్రీనివాసులు

● 14వ సారి రక్తదానం



శ్రీనివాసులుకు ప్రశంసా పత్రం అందిస్తున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి

మద్దికెర, జూన్ 22: ఆరు నెలల చిన్నారి రక్తం కొరతతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా.. మద్దికెర గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు (జక్కన్న) అనే వ్యక్తి 14వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం గుంతకల్లు మండలం తురకపల్లి గ్రామానికి చెందిన ఆరు నెలల చిన్నారికి ఏబీ పాజిటివ్ రక్తం కావాల్సి ఉండగా.. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రక్తం కావాలని కోరగా.. స్పందించిన శ్రీనివాసులు రక్తదానాన్ని చేశాడు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. రక్తదానంతో ఎలాంటి రోగాలు కూడా రావని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు బంగారు శ్రీను, దివ్యాంగుల సంఘం నాయకులు లింగమూర్తి ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

మద్దికెర, జూన్ 22: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక రంగనాథస్వామి ఆలయంలో టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లు అభివృద్ధిలో నడవాలని, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం వల్ల 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే మద్దికెర గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం, మద్దమ్మవ్వ దేవాలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామి, మద్దమ్మ దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్వహకులు విజయ్ ప్రసాద్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎన్డీయే కూటమితోనే కాపులకు న్యాయం

మద్దికెర, జూన్ 22: రాష్ట్రంలో ఎన్డీయే కూటమితోనే కాపులకు న్యాయం జరుగుతుందని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వైపీ వీరన్న అన్నారు. శనివారం మద్దికెరలో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో కాపులకు ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కాపు జాతికి న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు వైపీ ప్రసాద్, క్రాంతి కుమార్, భైరెడ్డి రవి తదితరులు ఉన్నారు.

మంత్రులను కలిసిన ఆదోని ఎమ్మెల్యే



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, జూన్ 22: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అనేక అభివృద్ధి పనులకు నిధుల విడుదలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే డా పార్థసారథి శనివారం విజయవాడలో పలువురు మంత్రులను కలిసి కోరారు. పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మైనారిటీలకు సంబంధించిన షాదీ ఖానా, ఈద్గాల నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని మైనారిటీల సంక్షేమ శాఖా మంత్రి ఎండీ ఫరూక్‌ను కలిసి కోరినట్లు డా పార్థసారథి తెలిపారు. సీమ ప్రాంతంలో చాలా కాలంగా అసంపూర్తిగా మిగిలిన నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతులు, ప్రజలను ఆదుకోవాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. సీమ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారని పార్థసారథి తెలిపారు.

స్పీకర్‌కు ఎమ్మెల్యే బీవీ శుభాకాంక్షలు



ఎమ్మిగనూరు, జూన్22: రాష్ట్ర శాసన సభ కొత్త స్పీకర్‌గా ఎంపికైన చింతకాయల అయ్యన్న పాత్రుడిని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అసెంబ్లీలో స్పీకర్‌గా చింతకాయల అయ్యన్న పాత్రుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడారు.

ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 22: పాఠశాలల విలీనాన్ని ఉపసంహరించుకొని ప్రాథమిక విద్యావ్యవస్థను పరిరక్షించాలని యూటీఎఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు సునీల్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి గిరిబాబు, నాయకులు నగేష్, జగన్మోహన్, రిషికేశవ చక్రపాణి, ఇమ్రాన్, విష్ణు పాల్గొన్నారు.

● పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను గుర్తించడంలో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా విద్యాశాఖ పాటించాలని ఎంటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు అన్నారు. శనివారం పురపాలక ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు కోటన్న, అనిల్ కుమార్, సురేష్ కుమార్, నూర్-ఉల్-హక్, ప్రతాప్ రెడ్డి, ఆనంద్, రమేష్ రావు, జ్ఞానమద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

జిల్లాలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి పల్లెలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు ఎద్దులకు రంగులు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. రైతులు వర్షాలు ఆశాజనకంగా కురవడంతో వ్యవసాయ పనులను మొదలు పెట్టారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ఎద్దుల పరుగు పందేల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రైతులే నిర్వహించడంతో భారీగా జనాలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.



కోసిగిలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు



బనవాసిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి



మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామంలో కలశాలను తీసుకెళ్తున్న మహిళలు



గోనెగండ్లలో వృషభాలను ఊరేగిస్తున్న దృశ్యం



కోసిగిలో అశేష జనవాహిని నడుమ పరుగు పందెంలో ఎద్దులు



మద్దికెరలో గెలుపొందిన వృషభాలను ఊరేగిస్తున్న దృశ్యం



ఆదోని మండలం దొడ్డనగేరిలో గెలిచిన వృషభాలతో రైతులు



గుడికల్లులో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు



ఆలూరులో ఏరువాక పౌర్ణమి సందర్భంగా దుక్కులు దున్నుతున్న సీపీఐ నాయకులు



ముగతిలో ఎద్దులతో టీడీపీ నాయకులు

బైపాస్ లైన్ వేస్తే ఆత్మహత్యలు చేసుకుంటాం

● దౌల్తాపురం రైతుల హెచ్చరిక

చిప్పగిరి, జూన్ 22: గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో హనుమాన్ జంక్షన్ రైల్వే స్టేషన్ నుంచి ఆదోని సర్కిల్ వరకు కొత్తగా బైపాస్ రైల్వే లైన్ నిర్మిస్తే ఆత్మహత్య చేసుకుంటామని దౌల్తాపురం, గుంతకల్లు, చిప్పగిరి, కమ్మకొట్టాల రైతులు అన్నారు. పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ అధికారులు సర్వే పనులను ప్రారంభించారు. సర్వే పనులను రైతులు అడ్డుకున్నారు. ఈ బైపాస్ రైల్వే లైన్ నిర్మాణం వల్ల వేలాది ఎకరాలు బీడు భూమిగా మారుతాయని గుంతకల్లు కాంగ్రెస్ ఇన్‌చార్జి కావలి ప్రభాకర్, రైతులు యుగంధర్ రెడ్డి, సోమశేఖర్; జయసూరి పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి కిలో మీటర్ల దూరం పైప్‌లైన్‌లు వేసి భూములను సాగు చేస్తున్నారని, తద్వారా అంతో, ఇంతో లబ్ధి పొందుతున్నారని, ఇలాంటి సమయంలో బైపాస్ నిర్మించడం వల్ల ఆ భూములన్ని బీడు భూములుగా మారుతాయని పేర్కొన్నారు.

పత్తికొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

●మంత్రి టీజీ భరత్‌ను కలసిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ



మంత్రి టీజీ భరత్‌తో ఎమ్మెల్యే కేఈ తదితరులు

పత్తికొండ,జూన్ 22 : పత్తికొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌ను కోరారు. శనివారం విజయవాడలో మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి మాట్లాడారు. వ్యవసాయమే ఆధారమైన పత్తికొండ ప్రాంత ప్రజలు ఏటా ఏర్పడుతున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక వలస బాటపడుతున్నారన్నారు. వలసల నివారణకు స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లాఅధ్యక్షులు తిక్కారెడ్డి, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి బత్తిన లోక్‌నాథ్ తదితరులు ఉన్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన రేఖాగౌడ్



ఎమ్మిగనూరు రూరల్, జూన్ 22: జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను శనివారం జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖా గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మిగనూరులో అధికంగా అన్ని వర్గాల ప్రజలు చేనేత రంగాన్ని నమ్ముకున్నారని, చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, అలాగే నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న తాగునీరు మరియు సాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, శాశ్వత పరిష్కారం కోసం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరినట్లు ఆమె తెలిపారు. అయన సమస్యలన్నీ పరిష్కస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం

● పూజల్లో పాల్గొన్న కలెక్టర్ సృజన



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆధునికీకరించిన సమావేశ మందిర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన

ఆదోని, జూన్ 22: ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదునీకరించిన సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ డా. జీ సృజన ప్రారంభించారు. శనివారం జిల్లా కలెక్టర్ సృజన ముందుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎస్పీ శివనారాయణ స్వామితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో ఆధునీకరించిన కారిడార్, రికార్డు రూమ్, మీటింగ్ హాలును పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చే సిన కార్యాలయం నిర్మాణం ఆధునీకరణ ముందు, తరువాత చేసిన వీడి యో పుటేజీలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాస రాజు, పెద్దయ్య, రుద్రగౌడ్, రామేశ్వర్ రెడ్డి, వలిబాషా, కౌసర్ బాను, వినీత్ పాల్గొన్నారు.

7,8,9 తరగతుల ప్రవేశానికి 24న రాత పరీక్ష

ఆలూరు, జూన్ 22: ఆలూరు మోడల్ స్కూల్‌లో 2024-25 విద్య సంవత్సరానికి 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలూరు మోడల్ స్కూల్‌లో రాత పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ రాఘవరావు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హల్ టిక్కెట్లు తీసుకోవాలన్నారు. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. 7వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 23 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.

పంట మార్పిడి చేసుకోవాలి

ఆలూరు రూరల్, జూన్ 22: రైతులు పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలని ఆలూరు ఏవో వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ప్రతిఏటా ఒకే రకం పంట సాగు చేయడం వల్ల నష్టం జరుగుతుందని, పంట మార్పిడితో, పంట దిగుబడి గణనీయంగా పెరిగి లాభం వస్తుందని తెలిపారు. ఎరువుల దుకాణాల్లో క్రిమి సంహారక మందులు, ఎరువులను రైతులకు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేటుకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీమఠంలో సత్యనారాయణ స్వామి వ్రతం

మంత్రాలయం, జూన్ 22: వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళవాయిద్యాలమధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం పౌర్ణమి పురస్కరించుకుని ప్రవచనా మండపంలో సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ, హారతులు ఇచ్చారు. అంతకుముందు రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు.

మొక్కు చెల్లింపు

పత్తికొండ, జూన్ 22 : పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పత్తికొండ వెంకటేశ్వరస్వామిదేవాలయంలో టీడీపీ నాయకులు బీటీగోవింద్, సోమ్లానాయక్, గోపాలయ్యల నేతృత్వంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు.

సారు మళ్లీ వస్తున్నారు..!

● మీ పనులన్నీ చక్కబెడతాం

● కొంత మంది వీఆర్వోల అక్రమ వసూళ్లు



ఎమ్మిగనూరు రూరల్, జూన్ 22: సార్వత్రిక ఎన్నికలకు ముందు పని చేసిన ఓ అధికారి తిరిగి వస్తున్నాడంటూ మండలంలోని కొంతమంది వీఆర్వోలు అక్రమ వసూళ్లకు తెరలేపారు.. సారు తిరిగి వస్తున్నాడని చెప్పడంతో సగంలో నిలిచిపోయిన పనులకు సంబంధించిన లబ్ధిదారులు ముడుపులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భూసర్వేలు, ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వడం వంటి కార్యక్రమాలు జరిగాయి. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రెవెన్యూ కార్యాలయంతోపాటు ఇతర కార్యాలయాల్లో పని చేస్తున్న కొంతమంది ప్రధాన అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో గత ప్రభుత్వంలో మొదలైన భూములకు సంబంధించిన పనులు సగంలో నిలిచిపోయాయి. అంతేగాక ఆ పనులు చేసేందుకు గతంలో ఇక్కడ పని చేసిన ఓ ప్రధాన రెవెన్యూ అధికారితోపాటు కొంత మంది వీర్వోలు భూముల లబ్ధిదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. అంతేగాక పని చేసేందుకు కొంతమంది దగ్గర కొంత మొత్తాన్ని ఒప్పుకొని సగం వరకు దండుకున్నారు. అయితే ఎన్నికలు రావడంతో ఈ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎన్నికలు పూర్తికావడంతో రెవెన్యూ అధికారులతోపాటు ఎన్నికలకు ముందు బదిలీ అయిన ఆయా శాఖల అధికారులు తిరిగి యథాస్థానానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మిగనూరులో పని చేసిన ఓ ప్రధాన రెవెన్యూ అధికారి సైతం తిరిగి ఎమ్మిగనూరుకు వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు కలిసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇదే అదునుగా అక్రమ వసూళ్లకు రుచిమరిగిన వీఆర్వోలు సారు మళ్లీ వస్తున్నారు...మీ పనులన్నీ చక్కబెడతామంటూ బాధితులకు ఫోన్లు చేసి మరీ చెబుతున్నట్లు తెలిసింది. అంతేగాక వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సదరు అధికారి రాకముందే ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటే గతంలో ఈ వీఆర్వోలు ఏ మేరకు బాధితుల నుంచి దండుకొని ఉంటారో ఇట్టే అర్థమవుతోంది. గతంలో పనిచేసిన అధికారి తిరిగి ఎమ్మిగనూరుకు వచ్చాడంటే ఇక వీఆర్వోల అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయే అవకాశం ఉందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మరి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధి అధికారుల నియామకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

ఎమ్మిగనూరు, జూన్ 22: మెగా డీఎస్సీని 25000 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు డీఎస్సీ విడుదలకు మొదటి సంతకం పెట్టడం అభినందనీయమన్నారు. అయితే కేవలం కొన్ని పోస్టుల కు మాత్రమే కాకుండా 25000పోస్టులతో డీఎస్సీ విడుదల చేసేందుకు సీఎం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, అప్రెంటీస్ విధానం రద్దు చేయాలని కోరారు. ఉద్యోగుల పదవీ విరమణ వ యస్సు 58ఏళ్లకు తగ్గించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.36లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అజిద్, అనుమంతు, వినోద్, బాను, అఖిల్, మహేష్, కృష్ణ, భీమేష్, రమేష్, రాజేష్, గురు, రమేష్, చిన్న పాల్గొన్నారు.

జొన్నగిరి అభివృద్ధికి కృషి చేయాలి



కేఈ శ్యాంబాబును కలిసి అభినందనలు తెలుపుతున్న నాయకులు

తుగ్గలి, జూన్ 22: టీడీపీకి కంచుకోట అయిన జొన్నగిరిని అభివృద్ధి చేయాలని టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, తాలుకా రైతు సంఘం నాయకులు బాలన్న, రవియాదవ్‌లు అన్నారు. శనివారం అమరావతిలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మంత్రి టీజీ భరత్‌కు వినతి

తుగ్గలి, జూన్ 22: రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి టీజీ భరత్‌ను కోరినట్లు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి తెలిపారు. ఆదివారం అమరావతిలో మంత్రి టీజీ భరత్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలను కలిసి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

డయోరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ఎమ్మిగనూరు, జూన్ 22: పట్టణంలోని డయోరియా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ డీఈఈలు మనోహర్ రెడ్డి, నీరజ, మేనేజర్ ప్రసాద్ సిబ్బందికి అవగాహన కల్పించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు హెల్త్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, ఆశావర్కర్లులకు స్టాప్ డయోరియా క్యాంపెన్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ పట్టణవాసులు వ్యాధుల బారిన పడకుండా, డయోరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న పానీపూరి, ఫాస్టు పడ్ సెంటర్ల దగ్గరకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ శరత్ చంద్ర, మెడికల్ ఆఫీసర్ జాహ్నవి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్యన్న, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రస్తుతం వర్షాకాలం కావటంతో డయోరియా ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పట్టణవాసులు కాచి చల్లార్చి వడబోసిన నీటినే త్రాగాలని మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి శనివారం తెలిపారు. అలాగే బయట ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

స్వచ్ఛమైన నీటి సరఫరాకు చర్యలు

పత్తికొండ టౌన్, జూన్ 21: పత్తికొండ మేజర్ గ్రామ పంచాయితీలో కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన తాగునీరును పట్టణవాసులకు సప్లయ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ పంచాయితీ ఈవో నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ ఖాన్‌లు అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా కూడా కలుషిత నీరు రాకుండా ఎప్పటికప్పుడు లీకేజీ మరమ్మతులు, వాటర్ ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ చేపట్టి మంచి నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే శానిటేషన్ పనులు కూడా ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ పంచాయితీ సిబ్బంది చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మం నశిస్తే అశాంతి



భగవద్గీతను బోధిస్తున్న నిత్యతృప్త దాస్

ఆదోని రూరల్, జూన్ 22 : ధర్మం నశిస్తే అంతా అశాంతి నెలకొంటుందని ఇస్కాన్ ధర్మ ప్రచార కర్త నిత్యతృప్త దాస్ తెలిపారు. మండలంలోని విరుపాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేపట్టారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.